# దశమ గ్రహ గ్రహణం

(సోమేశ్వర సాహితీసమితి(విశాఖపట్నం)వారి కథానికల పోటీ(1998)లో బహుమతి పొందిన కథ)



ఊరి పెద్దలు రచ్చబండ దగ్గర కూర్చుని చుట్ట కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

గ్రామంలో అయ్యవారి అమ్మాయి లేచిపోవడం దగ్గర్నుంచి కాశ్మీరులో అల్లకల్లోలం వరకు అన్ని విషయాలు వారి చర్చల్లో దొర్లుతున్నాయి.

దూరాన్నుంచి కరణంగారి పాలేరు కోటేసు వగరుస్తూ వస్తూ కనిపించాడు.

వాడిని చూస్తూనే-

"మళ్లీ ఎవరి కొంపకి నిప్పుపెట్టడానికో కరణం వీడిని ఊరిమీదికి వదిలాడు!" అన్నాడు ఎడ్డినాయుడు నోట్లోంచి చుట్టతీసి తుపుక్కున ఉమ్మివేస్తూ.

"ఈ కరణం ఖబర్‌స్థాన్‌కి పోతేనే కాని ఈ 'దోమాడ' గ్రామానికి పట్టిన పీడ విరగడకాదు!" అన్నాడు పీర్ సాయిబు అసహ్యంగా.

కరణాలలో అత్యధికులకి మంత్రాంగం, తంత్రాంగం మామూలు విషయాలే! తలలు మార్చడంవెన్నతో పెట్టిన విద్యయే!! సమస్యలను సృష్టించి, అవి పరిష్కారం కాకుండా జాగ్రత్త పడుతూ అందర్నీ తమచుట్టూ తిప్పుకుంటుండడం పరిపాటే!

అయితే... వీటన్నిటితోపాటు దోమాడ కరణానికి మరో క్వాలిఫికేషన్ ఉంది. అందరికీ మంచి చేస్తున్నట్లు నటిస్తూ అందరి మధ్యా కొట్లాటలు పెట్టి, వాళ్ళు కొట్టుకు చస్తూంటే చూసి ఆనందించడం ఆయన హాబీ!

ఈ విషయం ఊరివారందరికీ తెలిసినా ఆయన్ని ఎదిరించే ధైర్యం ఎవరికీ లేకుండడంతో ఎవరూ నోరు మెదిపేవారు కాదు. చాటుమాటున తిట్టుకోవడమేకాని, ఎదుటపడి అడిగేవారు కాదు. అందువల్ల ఇష్టంవున్నా, లేకపోయినా ఆయన చెప్పినట్లల్లా కీలుబొమ్మల్లా ఆడుతూండేవారు.

కరణంగారికి తగినవాడే ఆయన పాలేరు కోటేసు. కరణం విశ్వామిత్రుడైతే– వీడు నక్షత్రకుడు. ఆయన చూసి రమ్మంటే వీడు కాల్చి వచ్చే రకం! భూలోకంలో నారదమహర్షి లేని లోటును వాడు యథాశక్తి తీరుస్తుంటాడు. అందుకనే కోటేసును చూసినా ఊరిప్రజలకు పరమ అసహ్యం.

"ఏమిట్రా... పందెంగుర్రంలా వగరుస్తూ వచ్చావు?" అన్నాడు చౌదరిబాబు– వాడు దగ్గరికి రాగానే. పట్నంలో ఓ వెలుగు వెలిగించినప్పటి గుర్రప్పందాల అనుబంధం, అనుభవం ఆయనకింకా పోలేదు.

"బాబుగోరూ... మా దొరకు పానం మీదికి వచ్చింది. ఇప్పుడో, మరికాసేపట్లోనో అన్నట్లున్నాడు. ఊరిపెద్దల్ని చూసి మాట్లాడితేనే కాని, ఆరి పానం పోదట. మిమ్మల్నందర్నీ పిలుచుకు రమ్మని నన్ను ఉరుకులెత్తించాడు. బేగి పొండ్రి. నేనింకా మందుకోసం ఆచార్లుగోరి దగ్గరకు పోవాలి!" అంటూ పాఠం అప్పచెప్పినట్లు చెప్పి సమాధానంకోసం చూడకుండా అదే పోక పోయాడు కోటేసు.

"కరణంగారికి వంట్లో బాగాలేదనీ, నాలుగురోజులు నలతగా ఉన్నాడనుకున్నాం కాని, ఇలా ప్రాణం మీదికి వస్తుందనుకోలేదే! అందుకే ఏ క్షణానికి ఏమొస్తుందో ఎవరూ చెప్పలేరన్నారు పెద్దలు!" అన్నాడు చౌదరిబాబు దివాలా తీసినవాని వేదాంతధోరణిలో.

"ఏం నాయుడూ... పోయొద్దాం అంటావా?! ఎంత పాపిష్టిముండాకొడుకైనా చివరిక్షణాలలో మనల్ని చూడాలనుకుంటున్నాడాయె!" అన్నాడు చౌదరిబాబు.

"పుట్టెతో పుట్టిన బుద్ధి- పుడకలతోకాని పోదంటారు చౌదరిబాబూ! ఈ కరణం పోతూపోతూ కూడా మనకేదో పితలాటకం పెట్టే పోతాడు. అందుకనే వాడి నీడన్నా నాకు భయమే! వెళ్లేదేమిటి పోదూ..!" అన్నాడు నాయుడు.

"ఆ మాట నిజం! కరణం ఈ జమీన్ మీద సైతాన్. ముదనట్టపోడు పోతే పోనీ..!" అన్నాడు పీర్‌సాయిబు బీడీ దమ్ములాగుతూ.

"ఏమిటీ... అందరూ సీరియస్‌గా చర్చించుకుంటున్నారు?" అంటూ వచ్చాడు ఏసుపాదం చేతిలో బైబిల్ పట్టుకుని. ఆయన ఆ గ్రామం చర్చిలో పాస్టర్.

"రా... రా... నువ్వే తక్కువయ్యావు!" అన్నాడు చౌదరి.

" ఏం లేదు నల్లదొరా... కరణానికి ప్రాణం మీదికొచ్చిందట. ఇప్పుడే కోటేసుగాడొచ్చి కబురు చెప్పాడు" అన్నాడు నాయుడు.

వాళ్ళిద్దరూ చిన్ననాటి స్నేహితులు. నిగనిగలాడే అల్లనేరేడు పండు వర్ణంతోపాటు, వేషభాషల్లో ఇంగ్లీషువారిని అనుకరించాలని ప్రయాసపడ్తుంటాడు ఏసుపాదం. తన పేరుని కూడా జాన్సన్ అని మార్చుకునే ప్రయత్నంలో ఉన్నాడు. అదింకా గెజిట్ పబ్లికేషన్ కాలేదు. ఆ లాంఛనం పూర్తయితే- పాము కుబుసాన్ని విడిచినట్లు ఏసుపాదం నామాన్ని వదిలేసి 'జాన్సన్' అవతారం ఎత్తుతాడు. అందుకే నాయుడు సరదాగా అతన్ని "నల్లదొరా!" అని పిలుస్తుంటాడు. వాళ్ళిద్దరికీ ఉన్న చనువుకొద్దీ అతనేమీ అనుకోడు.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ- "దైవ కుమారుడైన ప్రభుఏసు పాపులను క్షమియించును. కరణము గొప్ప పాపములు చేసినవాడైనను క్షమియింపుమని కోరుచో క్షమియించును. ఆయన పరమ దయామయుడు. కనుక పోయి చూచుటయే ఉత్తమము" అన్నాడు ఏసుపాదం- నిత్యమూ చర్చిలో అలవాటైన బైబిల్ భాషలో.

"కరణం సామాన్యుడే కాదు, మనల్ని చూడకుండానే ప్రాణం పోయిందంటే దయ్యమై పట్టుకుంటాడు కూడాను!" అన్నాడు చౌదరి నవ్వుతూ.

"అవ్... అవ్... ఆ మాట నిజం!" అన్నాడు పీర్‌సాయిబు.

"అయితే పోదాం... పదండి! ఆలస్యం ఎందుకు... ఈలోగా చస్తాడో, ఏమో!" అన్నాడు రెడ్డినాయుడు లేస్తూ.

ఆ వెనకనే అందరూ లేచారు.

* * *

ఊరిపెద్దలంతా కరణంగారింటికి చేరుకున్నారు.

కరణంగారిని ఇంటిముందు వసారాలో నులకమంచం మీద పడుకోబెట్టారు.

ఊరిలోని ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి ఆచార్లుగారు వచ్చి ఏదో నల్లని పొడిని తేనెలో రంగరించి కరణంగారి నాలుకకు రాస్తున్నాడు. చెట్టులేనిచోట ఆముదం చెట్టే మహావృక్షమైనట్లు- ఆ కుగ్రామంలో దేదీప్యమానంగా వెలుగుతున్నాడు ఆచార్లుగారు.

దూరాన్నించి ఆచార్లని చూడగానే- "నీ చేతిమాత్ర వైకుంఠయాత్ర! అన్నట్లు అదుగో... ఆచార్లు కూడా వచ్చేశాడు కరణానికి మరణశాసనం రాయడానికి, అంపకాలు పెట్టడానికీ!" అన్నాడు చౌదరి నవ్వుతూ.

అందరూ వెళ్లి కరణంగారి మంచం దగ్గర నిలబడ్డారు.

వీరి రాక చూసి గుమ్మానికి అవతల కూర్చున్న ఆడవారు మరికొంచెం వెనక్కి జరిగారు. కరణంగారి ప్రక్కనే స్టూల్‌మీద ఆయన తమ్ముడు కూర్చున్నారు.

అతన్ని చూడగానే "ఎలా ఉంది?" అని అడిగాడు రెడ్డినాయుడు.

"బాగా లేదండీ... వచ్చేప్రాణం-పోయేప్రాణంలా ఉంది. దేవుడి మీదనే భారం వేశాం!" అన్నాడు ఆయన.

"మొన్నమొన్నటివరకు బాగానే ఉన్నారే..! ఇంతలో ఏమైంది?" అన్నాడు చౌదరి.

"నాలుగురోజులక్రితం తిప్పొచ్చి పడిపోయారండీ! ఆచార్లుగారు మందిస్తే తగ్గిందండీ. అయితే... నిన్నటినుంచి తిరగబెట్టి, చూస్తూండగానే విషమించిందండీ!" అన్నాడు ఆయన.

"పర్వాలేదులెండి- ఆచార్లుగారున్నారుగా... తగ్గిపోతుంది!" అన్నాడు పీర్‌సాయిబు తానూ ఏదో మాట్లాడాలన్నట్లు.

"అన్నింటికీ ఆ ప్రభువే ఉండెను. సర్వులను ఆయనే రక్షించును" అన్నాడు ఏసుపాదం.

'ఇంకానయం- పాపులను రక్షించును... అన్నాడు కాదు!' అని మనసులోనే అనుకున్నాడు రెడ్డినాయుడు.

"నాదేముందండీ... నేను మందియ్యగలనే కాని, ప్రాణం పోయగలనా? అంతా దైవేచ్ఛ..!" అన్నాడు ఆచార్లు వినయం ఒలకబోస్తూ.

"అన్నయ్యా... ఊరిపెద్దలంతా నిన్ను చూడాలని వచ్చారు అని రెండుమూడుసార్లు కరణంగారి చెవి దగ్గర గట్టిగా అన్నాడు" కరణంగారి తమ్ముడు.

బరువుగా కళ్లు తెరిచాడు కరణం.

ఊరిపెద్దలు కంటపడేసరికి ఆయన ముఖంలో కాంతి వచ్చింది.

ఏదో మాట్లాడాలని పెదవులు కదిల్చాడు. నెమ్మది నెమ్మదిగా ఓపిక వచ్చింది. లేచికూచోడానికన్నట్లు వెనక్కి జరగడానికి ప్రయత్నం చేశాడు.

"చూశారా... ఊరిపెద్దల్ని చూసేసరికి అన్నయ్యకి ప్రాణం లేచివచ్చింది. ప్రొద్దునంతా ఊరివారిని చూడాలని ఒకటే కలవరింత! అలా పలవరించి, పలవరించి ఘగతలోకి జారుకున్నాడు" అన్నాడు తమ్ముడు.

"జీవుడు అంతేనండీ! కోరిక బలంగావుంటే దేహాన్ని వదిలిపెట్టి పోలేడు" అన్నాడు ఆచార్లుగారు. ఆ వెంటనే కరణంగారివంక చూస్తూ "గోడకి దిండువేసి ఆయన్ని కూచోబెట్టండి. ఆయన ఏదో చెప్పాలనుకుంటున్నాడు" అన్నాడు.

దిండుని గోడకి వేసి ఆయన్ని నెమ్మదిగా లేపి, దాని ఆసరాగా కూచోబెట్టారు.

కరణంగారికి మాట్లాడే ఓపిక వచ్చింది. రెండు చేతులూ ఎత్తి హీనస్వరంతో "నమస్కారం!" అన్నాడు.

ఊరిపెద్దలు ప్రతినమస్కారం చేస్తూ- "మీరు శ్రమపడకండి... విశ్రాంతిగా ఉండండి!" అన్నారు.

కరణంగారు ఆగి ఆగి నెమ్మదిగా మాట్లాడసాగారు.

"నా మనసులోని మాట మీకు చెప్పాలి. అందుకే నా ప్రాణం ఇంకా పోకుండా ఉంది. చేసిన పాపం చెప్తే పోతుందంటారు. నేను ఎన్నో పాపాలు చేశాను. బ్రతికుండగా మిమ్మల్ని ఎన్నో బాధలు పెట్టాను. మీలో మీకు కొట్లాటలు పెట్టి, చూసి ఆనందించాను. ఆ పాపాలన్నీ నా కళ్లముందు మెదులుతూ నన్ను బాధిస్తున్నాయి. మిమ్మల్ని హింసలు పెట్టి నేను బావుకున్నదేముంది? మీరందరూ మనస్ఫూర్తిగా నన్ను క్షమిస్తేనే నా ప్రాణం సులువుగా పోతుంది" అంటూ కళ్లు మూసుకున్నాడు కరణం. ఆయన కళ్లంబట రెండు చుక్కలు రాలాయి.

కరణం కంటనీరు చూసేసరికి ఊరిపెద్దలు ఐస్‌లాగా కరిగిపోయారు. ఆయన మీద టోలెడు జాలి కలిగింది. ఆ సానుభూతి వరదలో ఆయన మీదున్న అసహ్యం అంతా కొట్టుకుపోయింది.

"మీరు గతాన్ని మనసులో పెట్టుకోకండి. జరిగిందేదో జరిగిపోయింది. తెలిసో, తెలియకో అందరం తప్పులు చేస్తాం!" అంటూ ఓదార్చాడు నాయుడు.

"ఎవరెన్ని చేసినా చివరికి మిగిలేదేముందిలెండి? చేసిన తప్పులు తెలుసుకొని ఒప్పుకుంటే చాలు!" అన్నాడు చౌదరిబాబు.

"ప్రభూ... నేను పరమపాపిని. నా పాపములను క్షమియింపుము- అని ప్రార్థించినచో ఎంతటి ఘోరపాపులనైనను ఆ ప్రభువు క్షమియించును" అన్నాడు ఏసుపాదం.

కరణంగారు మళ్లీ చెప్పడం మొదలుపెట్టారు- "మీ మంచి మాటలతో నా మనసు తేలికపడింది. కాని, మీరందరూ క్షమించాము అంటేనే నాకు తృప్తి కలుగుతుంది" అన్నాడు.

ఇంక విధిలేక అందరూ "క్షమించాం..!" అన్నారు కోరస్‌గా.

కరణంగారి కళ్లలో తృప్తి కనిపించింది. "చాలాసంతోషం! మీరందరూ నన్ను క్షమించినందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఇంకొక్క కోరిక ఉంది. అదికూడా తీరిందంటే నా ఆత్మకు శాంతి కలుగుతుంది" అన్నాడు నెమ్మదిగా.

అదేమిటో చెప్పండన్నట్లు ఆయనవంక చూశారు అందరూ.

కరణంగారు చెప్పడం మొదలుపెట్టాడు-

"మన గ్రామంలో హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు- అందరూ ఉన్నారు. నేను బ్రతికినంతకాలమూ మీలో మీకు కొట్లాటలు పెట్టాను. మీరు కొట్టుకుచస్తుంటే చూసి ఆనందించాను. నేను చేసిన పాపం, దాని ఫలితం నాతోపాటే పోవాలి. అందువల్ల మీరందరూ ఐకమత్యంగా ఉండేందుకు, నిత్యమూ నన్ను మరిచిపోకుండా ఉండేందుకు వీలుకల్పించే విధంగా నా చివరికోరికను కాగితం మీద రాసి కవర్లో పెట్టి సీలు చేశాను. ఆ కవరు నా తల క్రిందనే ఉంది. నేను చనిపోయాక మీరు ఆ కవరుని తెరిచి, అందులో రాసిన విధంగా తూ.చ. తప్పకుండా అమలుచేస్తామని మాటివ్వాలి!" అంటూ కుడిచేతిని ముందుకుసాచారు కరణంగారు.

'పాపం... ఎన్ని తప్పులు చేసినా చివరకు కరణం మన ఐకమత్యంకోసం మహా ఇదైపోతున్నాడు' అని అందరికీ కొండంత జాలి కలిగి ఆయన చేతిలో చేయివేసి అందరూ "అలాగే చేస్తాం!" అంటూ ప్రమాణం చేశారు.

"చాలాసంతోషం! ఇంక నాకు సెలవైంది. మీరందరూ నా ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తుండండి... నేను నిశ్చింతగా కన్నుమూస్తాను" అంటూ మగతలోకి జారుకున్నాడు కరణం.

వెంటనే ఎవరికి తోచినవిధంగా వారు ప్రార్థనలు మొదలుపెట్టారు.

కరణంగారి ముఖం కాంతిహీనం కాజొచ్చింది.

"అయిపోతోంది... కరణంగారికి అంతిమ ఘడియలు వచ్చేశాయి. తులసినీళ్లు పట్రండి!" అని అరిచాడు ధన్వంతరి ఆచార్లు.

తలుపుకి ఆవలనున్నవారిలో ఒకామె పెరటివైపు పరుగుతీసింది.

కరణంగారి భార్యా, ఇతర ఆడవారూ "నాయనోయ్- దేవుడోయ్..!" అంటూ బయటకు వచ్చి రోదనలు మొదలుపెట్టారు.

పెరటివైపున వెళ్లిన ఆమె నీళ్ళగ్లాసులో తులసి ఆకులువేసి చెంచాతో తీసుకువచ్చింది.

"అమ్మా... మీ చేత్తో తులసితీర్థం వారి నోట్లో పోయండి!" అంటూ ఆచార్యులుగారు ఆ గ్లాసుని తాను అందుకుని కరణంగారి భార్యకు అందించారు.

ఆవిడ "నా దేవుడో..." అంటూ రోదిస్తూ చెంచాతో ఆ తీర్థాన్ని- ఆచార్యులుగారు "నారాయణ... నారాయణ..." అంటూండగా నోట్లో పోసింది.

మూడో గుటక సరిగ్గా వేశాడో, లేదో... కరణంగారి ప్రాణాలు బయటకు పోవడానికి కొట్టుకోసాగాయి.

ప్రాణం పోతుండగానే కరణంగారిని మంచం మీదనుంచి దించేసి బయట చాప మీద పడుకోబెట్టారు.

మరు నిమిషంలో ఆయన తుదిశ్వాస విడిచాడు.

కొంచెంసేపట్లో ఆయన అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇంతలో ఆచార్యులుగారు జ్ఞాపకం చేశారు-

"కరణంగారు తాను పోయిన వెంటనే సీల్డుకవరు తెరిచి అందులో రాసున్నది చదివి ఆ విధంగా చేయమన్నారు. అప్పుడే తన ఆత్మకి శాంతి కలుగుతుందని చెప్పారు. మనచేత ప్రమాణం కూడా చేయించుకున్నాడు. కవర్లో ఏమి రాసుందో చూడండి!" అని.

వెంటనే కరణంగారి తమ్ముడు ఆ కవర్ని తీసి అందరి సమక్షంలో తెరిచాడు. అందులోని కాగితం మీద కరణంగారి స్వదస్తూరీతో ఈ విధంగా రాసుంది-

"నా ప్రియాతిప్రియమైన గ్రామస్థులారా... నాకు సర్వమతాలూ సమానమే! అందువల్ల నా అంత్యక్రియలను ఒక వినూత్నపద్ధతిలో జరిపించి సర్వమత సహనాన్ని చాటించాలని నా కోరిక. అందుకుగాను నా శవాన్ని ఈ ఊరి తురకల పెద్దమసీదు ప్రాంగణంలో దహనం చేయండి. ఆ చితాభస్మాన్ని తీసుకువెళ్లి ఊరి చర్చిలో భద్రపరచండి. నా ఈ అంతిమవాంఛను తప్పక నెరవేరుస్తారని ఆశిస్తున్నాను. మీరందరూ నిత్యమూ నన్ను మరవకుండా ఉండాలని కోరుతున్నాను.

ఇట్లు

భవదీయుడు

చె. నా. వ్రాలు

దోమాడ కరణం"

– అని ఉంది అందులో.

ఈలోగా కరణంగారు కాలంచేసిన వార్త గ్రామమంతా గుప్పుమంది. జనం అంతా బిలబిలలాడుతూ కరణంగారింటికి చేరుకున్నారు.

కరణంగారి ఉత్తరం మీద చర్చ మొదలయ్యింది.

"హిందువుల శవాన్ని మా మసీదులోకి ఎలా తీసుకువస్తారు? వీల్లేదు!" అన్నాడు పీర్‌సాయిబు.

"అవును... అదంతే!" అన్నాడు మసీదులో ఉండే మౌల్వీ.

"అవునవును... వీల్లేదు" అన్నారు అక్కడ చేరిన మహమ్మదీయులు.

"ఒకవేళ మీరు ఒప్పుకున్నా కూడా హిందువుల చితాభస్మాన్ని మా క్రైస్తవుల చర్చిలో పెట్టడానికి ఎలా ఒప్పుకుంటాం?" అన్నాడు ఏసుపాదం.

"ఇటువంటిది ఎక్కడన్నా ఉందా? వీల్లేదు" అన్నారు అక్కడి క్రైస్తవులు.

"అయ్యా... ఇది కరణంగారి చివరికోరిక. అది తీరుస్తామని మీరంతా ప్రమాణం చేశారు... మర్చిపోయారా? ఆయన రాసినట్లు జరిపి తీరవలసిందే!" అన్నాడు కరణంగారి తమ్ముడు.

"అవునవును. మాటతప్పితే మహాపాపం!" అన్నారు అక్కడున్న హిందువులు.

వీల్లేదని మహమ్మదీయులు, క్రైస్తవులు- జరిగితీరాలని హిందువులు వాదించుకోవడం మొదలుపెట్టారు. వాదన ముదిరి మాటామాటా పెరిగి చివరకు చేతులు కలుపుకోవడం వరకు వచ్చింది. ఈలోగా ఎవరో వెళ్లి, 'దోమాడ గ్రామంలో దొమ్మీ జరుగుతోందని, జనం కొట్టుకు చస్తున్నా'రనీ పోలీసులకు ఉప్పందించారు.

వారు హుటాహుటిన వచ్చేసరికి గ్రామప్రజలు బాహాబాహీ కొట్టుకుంటున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి జనాన్ని తరిమాక- రాజలాంఛనాలతో కాకపోయినా, పోలీసులు వెంటరాగా కరణంగారి శవయాత్ర మొదలయింది. చివరికి హిందువుల స్మశానంలోనే ఆయనకి దహన సంస్కారాలు చేశారు.

"చూశారా... మన దోమాడ కరణం లౌక్యం?! బ్రతికి బాధించాడు, చచ్చి సాధించాడు" అన్నాడు చౌదరిబాబు.

"నిజమే! ఏదో మారాడనుకున్నాం కాని, అది పుట్టుకతో పుట్టిన బుద్ధి పుడకలతో కాని పోదు. తాను చచ్చినా కూడా ఊరివారు నిత్యమూ కొట్టుకుంటుండాలని ఇంతటి ఎత్తు వేశాడు. అదిచూసి ఆ మహానుభావుడి ఆత్మ సంతోషిస్తుందో, ఏమో..!" అన్నాడు రెడ్డినాయుడు.

అందరూ ఎవరికి తోచింది వారు అంటూ ఇళ్లకు చేరుకున్నారు. అప్పటినుంచి 'దోమాడ కరణం బ్రతికి బాధించాడు- చచ్చి సాధించాడు!' అన్న సామెత వచ్చింది.

ఇది ఆనాటి ముచ్చట! మరి, నేడో..?!

* * *

కాలగర్భంలో మూడువందల సంవత్సరాలు గడిచిపోయాయి.

దోమాడ కరణం తారకనామ స్మరణ మధ్య కన్నుమూయడంతో ఆయన ఆత్మకి ఉత్తమగతులు ప్రాప్తించాయి. ఆయన ఆత్మ బ్రహ్మలోకం చేరింది.

బ్రహ్మదేవుడు ఆయనకి వరం ఇచ్చాడు- "నువ్వు మరుజన్మలో చాలా ముఖ్యమైన పదవిని నిర్వహిస్తావు. నా పేరుతోనే ప్రసిద్ధి చెందుతావు. అయితే నీ పుణ్యఫలం ఖర్చు అయిపోయే సమయానికి నీకు చంద్రగ్రహణం పట్టుంది. ఆ కారణంగానే నీవు మరణిస్తావు. అయినా నీ పేరు శాశ్వతంగా నిలుస్తుంది..." అని!

సువిశాల భారతదేశంలో ఒక అగ్రశ్రేణి రాష్ట్రానికి అధినాయకుడుగా అవతరించాడు దోమాడ కరణం. ఈ అవతారంలో ఆయనపేరు 'అపరబ్రహ్మ.' పుట్టింది సామాన్య కుటుంబంలోనే అయినా అదృష్టం వరించి 'తెరవేల్పు' అయ్యాడు.

అంచెలంచెలుగా ఆయన భక్తగణం కూడా పెరిగింది. అచిరకాలంలోనే ఊరూరా ఆయన పేరిట భజన సమాజాలూ, భక్త కూటాలూ, అభిమాన సంఘాలూ వెలిశాయి. రాముడు, కృష్ణుడు వంటి ఇలవేల్పులు ఎలా ఉంటారో పాటకజనానికి తెలీదు. అయితే... తెరమీద వారి వేషాలను అపరబ్రహ్మ వేయగా చూశారు. ఆ బొమ్మలు చూసీచూసీ 'ఓహో... ఆ దేవుళ్ళు ఇలాగే ఉంటారన్నమాట!' అనుకుని, అటువంటి బొమ్మలు కొనుక్కొని ఇళ్లలో, గోడలమీదా, పూజామందిరాల్లోనూ పెట్టుకుని పూజలూ, పునస్కారాలూ, ధూపదీప నైవేద్యాలు వంటివి మొదలుపెట్టారు.

అంతేకాదు.., తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నాక అపరబ్రహ్మగారుండే నగరానికి వెళ్లి అక్కడ ఆయన దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించుకోసాగారు. ఆ జగన్మోహన రూపం చూసి పరవశించిపోయేవారు. కొందరు వీరభక్తులు ఆయనముందు కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చేవారు. సాక్షాత్తూ వేంకటేశ్వర స్వామిలాగా అపరబ్రహ్మగారు దక్షిణహస్తం పైకెత్తి భక్తులను దీవించేవారు.

ఇలా కొంతకాలం జరిగేసరికి అపరబ్రహ్మగారి పొట్ట చాకలిబానలాగా తయారయింది. కైవారం కూడా మరీ పెరిగిపోయి తెరకు ఇమడనంతగా అయింది. అటువంటి సమయంలో 'ఇంక ఈయన తెరసన్యాసం చేస్తే బాగుండును. ఆయనకీ, ఆయన

అభిమానులకీ కూడా క్షేమం!' అన్న గుసగుసలు ఊరూవాడా వినిపించసాగాయి. అంతటితో అపరబ్రహ్మగారిలో ఆత్మవిమర్శ చెలరేగసాగింది.

"అసలు నేనెవరిని? ఎందుకు పుట్టాను?" అని పదేపదే ప్రశ్నించుకోసాగారు.

కొంతకాలానికి ఆ ప్రశ్నకు సమాధానంగా "త్వమేవాహం... అహమే తత్వం! నువ్వే నేను- నేనే నీవు. నువ్వు ఈ రాజ్యాన్ని ఉద్ధరించడానికి వచ్చిన కారణజన్ముడివి" అని పదేపదే మనసులో వినిపించసాగింది. ఈవిధంగా సాక్షాత్తూ ఆ భగవంతుడే ప్రవచిస్తున్నట్లు అనిపించసాగింది.

అచిరకాలంలోనే "అహం బ్రహ్మాస్మి- నేనే బ్రహ్మను" అన్న బ్రహ్మజ్ఞానం కలిగింది. వెంటనే ఆత్మాభిమానం కోల్పోయి, అవమానాల మధ్య జీవిస్తున్న స్వజాతిని ఉద్ధరించాలని నడుంకట్టాడు.

అయితే... ఈ కానికాలంలో రాజులు లేరు కనుక, ప్రజలే ప్రభువులు కనుక ప్రజానాయకుడిగా పదవిలోకి రావాలని రాజ్యమంతటా సుడిగాలిలా చుట్టివచ్చాడు. ఆ ప్రభంజనంలో రాజ్యప్రజలు- "రక్షకుడు వచ్చాడు" అనుకుంటూ అపరబ్రహ్మకి అధికారం కట్టబెట్టారు.

అపరబ్రహ్మ అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యమూ వార్తలలో వెలుగొందుతూ ఉండాలని- రోజుకో సంచలనాన్ని సృష్టించసాగాడు.

ఆయనకి తాను చిన్ననాడు చరిత్రపాఠాలలో చదువుకున్న 'తుగ్లక్' గుర్తుకివచ్చాడు. 'తుగ్లక్ ఆలోచనలన్నీ మంచివే. అయితే ఆరోజుల్లో ఉన్న పరిస్థితులవల్ల వాటిని అమలుచేయలేకపోయాడు' అని బాధపడుతుండేవాడు. అటువంటి తుగ్లక్‌ను ఆదర్శంగా పెట్టుకుని రాజ్యమేలసాగాడు.

ఒకరోజున అపరబ్రహ్మగారికి 'ప్రజలే నా దేవుళ్ళు. వారు నాకు అధికారం అప్పజెప్పిన ఆత్మీయులు. వారి ఋణం తీర్చుకోవాలి' అనిపించింది.

వెంటనే ఓ బ్రహ్మముహూర్తాన శుభనిర్ణయం తీసుకుని "మీ అందరికీ నెలకి ఇరవై కిలోల బియ్యాన్ని కిలో రూపాయికే ఇచ్చేస్తున్నాను. అలాగే ధోవతులు, చీరలూ కూడా సగంధరకే ఇస్తాను. అందరూ తీసుకుని అనుభవించండి" అని ప్రకటించాడు. ఇలా చేయడంవల్ల వచ్చిన నష్టాన్ని అడ్డమైన వాటిమీద పన్నులు వేసి, జనాల పన్నులు ఊడపీకి వారిని ఆపన్నులను చేశాడు.

-అంతేవాసులతో "చూశారా... నా లౌక్యం! ఈ చేత్తో ఇచ్చాను. ఆ చేత్తో పుచ్చుకున్నాను" అని చెప్పి మురిసిపోయాడు.

మరో రోజున అపరబ్రహ్మగారికి చిన్నారిబాలలను చూస్తే బోలెడంత జాలివేసింది. వెంటనే "పిల్లలూ... మీరంతా బడికిపోయి బాగా చదువుకోండమ్మా! మీకు రోజూ మధ్యాహ్నంపూట ఇంత పులుసన్నం పెట్తాను" అన్నాడు. ఆ వెంటనే "పంతుళ్ళూ... మీరు పాఠాలు ఆపి వంటలు చేసి పిల్లలకి పెట్టండి!" అని ఆజ్ఞాపించాడు.

గత్యంతరంలేక 'సరే'నన్నారు పంతుళ్ళు.

అయితే పంతుళ్ళ వంటలు పిల్లలకు నచ్చలేదు. పంతుళ్ళు కూడా– "మా భార్యలు ఇళ్ళలోనూ, మేము బళ్ళలోనూ వంటలు చేయడమా?" అని వాపోయారు. దాంతో అపరబ్రహ్మగారికి మరో ఆలోచన వచ్చింది.

వెంటనే "పిల్లలూ... ప్రాణంకంటే మానం గొప్పది. అందువల్ల ఇంక మీకు ఒంటిపూట భోజనం వద్దు. సంవత్సరానికి రెండు గోచీలు నా ముద్రతో ఇస్తా. కట్టుకుని సుఖించండి!" అన్నాడు.

ఒంటిపూట భోజనం రోజుల్లో భోజనం పొందేవారూ, తింటుంటే చూస్తూండే పొందనివారూ అని పిల్లలు రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకోసాగారు.

పంతుళ్ళు కూడా– "మిగిలిపోయిన వంటకాలను ఎవరు తీసుకెళ్ళాలి? అసలు వండకుండానే బియ్యం, పప్పులు, చింతపండు వగైరాలు ఏ మేరకు, ఎవరు కాజేయాలి?"... వంటి విషయాలలో తగాదాలు వచ్చి కొట్టుకునేవారు.

ఆ కొట్లాటలు చూస్తుంటే, వాటిని గురించి వింటుంటే అపరబ్రహ్మగారికి బ్రహ్మానందంగా ఉండేది.

ఆ సమయంలో ఆయనకి అంతరాత్మ ఘోష వినిపించసాగింది.

ప్రబోధిస్తున్నట్లు మనోశ్రవణాలకు వినిపించసాగింది. అలా వినిపించగా, వినిపించగా ఒక శుభముహూర్తాన ఆయనకి ఆత్మజ్ఞానం కలిగింది. 'తాను గతజన్మలో దోమాడ కరణమనీ, తాను చేయవలసిన ఘనకార్యాలు ఇంకా ఎన్నో ఉన్నా'యనీ గుర్తుకివచ్చింది.

వెంటవెంటనే ఒకరోజున అపరబ్రహ్మ 'నిత్య సంఘర్షణ వ్రతం' అన్న కొత్త వ్రతానికి రూపకల్పన చేశాడు. దీని మహాత్మ్యంవల్ల ఆయన ఏ పలుకు పలికినా, ఏ పని చేసినా ప్రజలు రెండు వర్గాలుగానో, అంతకు ఎక్కువ ముఠాలుగానో చీలిపోవడం, నిత్యం కొట్టుకుంటూ ఉండడం పరిపాటి అయింది.

ఒకరోజున అపరబ్రహ్మకు పీడిత, తాడిత, బడుగు వర్గాలను చూస్తే గుండె చెరువైపోయింది. తన ప్రేమ హస్తం అందించి వారిని అమాంతం పైకి లాగాలనుకున్నాడు.

వెంటనే ఓ రోజున "ఈరోజునుంచీ మీ అందరికీ చదువులు, ఉద్యోగాలలో డెబ్బది శాతం కేటాయిస్తున్నాను" అని అకస్మాత్తుగా ప్రకటించాడు.

అదివిని మిగిలినవారు- "ఇదేమి న్యాయం? ఇప్పటికే మేము మట్టికొట్టుకు పోయాం. మమ్మల్ని సజీవంగా సమాధి చేస్తారా? ఈ అదనపు కేటాయింపులు రద్దు కావాలి" అంటూ ఆందోళన మొదలుపెట్టారు.

అవతలివారు ఊరుకుంటారా? "అపరబ్రహ్మగారి మాట చెల్లవలసిందే!" అంటూ ప్రతిఆందోళన మొదలుపెట్టారు. దాంతో వారూ, వీరూ కొట్టుకోసాగారు.

ఆ కలహభోజనానికి బ్రహ్మమానసపుత్రుడు, కలహభోజనుడు అయిన నారదమహర్షికంటె ఎక్కువగా సంబరపడిపోయాడు అపరబ్రహ్మ. ఆ భోజనం ఎక్కువైపోయి అసలు భోజనం మానేసి పాలూ, ఆకుకూరలూ తినడం మొదలుపెట్టాడు.

తర్వాత న్యాయమూర్తులు కల్పించుకుని, "పాత పద్ధతే కొనసాగాలి" అని తీర్పిచ్చారు. దాంతో ఆయన "అహో... హతవిధీ! సత్సంకల్పమునకు అన్నియు విఘ్నములే కదా!" అని వాపోయాడు.

కాలం గడిచిపోతోంది.

ప్రజలు ఏవో చిన్నచిన్న జట్టీలతో కొట్టుకుంటున్నారు కాని, పెద్దగా వీధులంబడి పోట్లాడుకోవడం లేదు.

దాంతో అపరబ్రహ్మగారికి ఆకలి కరకరలాడింది. అవకాశంకోసం ఎదురుచూస్తున్న ఆయనకు మంచి తరుణం వచ్చింది. రాజ్యంలో దుర్భిక్షం ఏర్పడింది. నాలుగు సంవత్సరాలుగా పంటలకు తీవ్రనష్టం రావడంతో ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకోసాగారు.

"ఇదంతా అపరబ్రహ్మగారి పరిపాలనా నిర్వాకం!" అని కిట్టనివాళ్ళు గట్టిగా అనడం మొదలుపెట్టారు.

ఈ విమర్శలను తిప్పికొట్టడానికి ఆయనకొక అద్భుతమైన ఆలోచన వచ్చింది.

వెంటనే ఆదరాబాదరాగా రైతు సదస్సు ఏర్పాటుచేశాడు. దాంట్లో రైతులు "మహాప్రభో... పంటలు పండక తిండికే గతిలేదు. ఈ పరిస్థితిలో బ్యాంకులూ, అప్పులిచ్చిన వాళ్ళూ బాకీలు తీర్చమని ఒత్తిడి చేస్తున్నారు. వడ్డీ కాదుకదా... అసలు కూడా తీర్చే శక్తి అసలు లేదు. మీరే తరుణోపాయం చూపించాలి" అంటూ మొత్తుకున్నారు.

వెంటనే అపరబ్రహ్మగారు కళ్ళు మూసుకుని ఆలోచించాడు. ఆయన మనోనేత్రానికి అద్భుతమైన పరిష్కారం గోచరించింది. వెంటనే కళ్ళు తెరిచాడు.

"నా ప్రియమైన రైతు బాంధవులారా... మీరే నా దేవుళ్ళు! నా దైవాలకు ఆపద వస్తే ఈ భక్తుడు ఊరుకుంటాడా? మీకు 'నీకు బెబ్బే... నీ యబ్బకు బెబ్బే'- కథ తెలుసుగా?" అని అడిగాడు.

"తెలుసు" అన్నారు రైతులు.

"ఇంకేం... అదే తారకమంత్రం! మీరు తీసుకున్న ఋణాలను నిర్భయంగా ఎగవేయండి. అడిగితే 'అసలుకు బెబ్బే... వడ్డీకి బెబ్బెబ్బే..!' అని చెప్పండి. ఇది మా ఆజ్ఞ!" అని సదస్సు చాలించాడు.

అపరబ్రహ్మగారి ఆజ్ఞానుసారం రైతులు ఋణాలు ఎగవేయడంతో ఇచ్చినవాళ్ళూ, ఎగవేసినవాళ్ళూ వీధుల్లోపడి కొట్టుకోసాగారు. దాంతో ఎవరు, ఎవరికి, ఎంత అవసరం వచ్చినా పైసా అప్పు కూడా ఇవ్వడం మానేశారు. బ్యాంకులు సరేసరి!

అపరబ్రహ్మగారి లీలలు భరించే శక్తి ప్రజలకు నశించింది.

'తమలో తమకు నిత్యమూ కొట్లాటలు పెట్టి ఆనందించడమే ఆయన ధ్యేయం!' అని వారు గ్రహించారు. వెంటనే రానున్న ఎన్నికలలో అయ్యవార్ని గద్దె దించాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

అపరబ్రహ్మగారికి దడ పట్టుకుంది. కలహభోజనం కరువైపోతోందన్న దిగులు ఎక్కువ కాసాగింది.

తరుణోపాయం కోసం జ్యోతిషులను సంప్రదించడం మొదలుపెట్టాడు, కాషాయం కట్టాడు, ఒంటి చెవికి కుండలం తగిలించాడు, తలపాగా చుట్టాడు, రాత్రుళ్లు చీరకట్టి తిరగసాగాడు, మెడలో రుద్రాక్షలు ధరించాడు, ముఖానికి విభూతి- కుంకుమ దట్టించి భూతవైద్యుని వేషం వేశాడు, శవ పూజలు చేశాడు.

ఎన్ని చేసినా గతజన్మలోని పుణ్యశేషం హరించుకుపోతూండడంతో ఏమీ ప్రయోజనం లేకపోతోంది. ఎన్నికల ప్రకటన వెలువడింది. మరోసారి ప్రభంజనంలా, రాష్ట్రాన్ని చుట్టసాగాడు అపరబ్రహ్మ.

"నా అనుంగు ప్రజలారా! నాకు మరోసారి పదవిని ఇవ్వండి. మీ సేవలోనే నా తనువు చాలింపనివ్వండి!" అంటూ వేడుకోసాగారు.

అయితే... ఎక్కడికి పోయినా- "నీకు బెబ్బే... నీ పదవికి బెబ్బే. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష!" అంటూ ఆయన పాఠాలు ఆయనకే అప్పజెప్పసాగారు.

ఇంక అపరబ్రహ్మగారికి ప్రజల మద్దతు అంతకంతకీ అడుగంటిపోతోందన్న వాస్తవం ఆయన పార్టీవారికి అవగతం అయింది.

"మీరు మర్యాదగా పదవినుంచి తప్పుకుని, యువకుడు- సమర్థుడు అయిన చంద్రశేఖరంగారికి నాయకత్వ బాధ్యతను అప్పజెప్పండి" అని అంతేవాసులు అపరబ్రహ్మగారిని చెవినిల్లు కట్టుకుని పోరాడసాగారు.

"పదవిని వదులుటయా? అది కల్ల! సింహాసనము పైననే నా పంచప్రాణములు పంచైక్యము చెందవలె!" అన్నాడు అపరబ్రహ్మ.

పార్టీ పరువు బజారున పడి అధికారం పరహస్తగతం అయ్యే ప్రమాదం ప్రస్ఫుటంగా కానవచ్చింది. పత్రికలకి, కార్టూనిస్టులకి కరువు లేకుండా కావలసినంత సరుకు లభిస్తోంది. అపరబ్రహ్మగారి లీలావిశేషాలను, దేశమంతా కథలు-కథలుగా చెప్పుకోసాగారు. అవి విన్నవారికి 'ప్రతాపరుద్రీయం' నాటకంలో 'పేరిగాని పాత్ర' గుర్తుకిరాసాగింది.

ఈ పరిస్థితులన్నీ గమనించిన చంద్రశేఖరం- అయ్యగారి అంతేవాసులలో అత్యధికులను తనవైపు తిప్పుకుని రక్తరహిత విప్లవంతో అపరబ్రహ్మగారిని అధికార పీఠం నుంచి తప్పించి సింహాసనాన్ని తాను అధిరోహించాడు.

అపరబ్రహ్మ "అహో... విధి ఎంతటి వైచిత్రము? నేను పైకి తీసుకువచ్చిన నావారే నా కన్ను పొడిచిరిగా! నమ్మినందుకు నాపై వెన్నుపోటుకు పాల్పడితిరిగా! కానిండు... నాకు మరల మంచికాలము రాకుండునా!" అంటూ దిగులుగా రోజులు గడపసాగాడు. ఆ దిగులు మరీ బరువై పక్షవాతం వచ్చి, ఎక్కువ కాలం మంచాన పడకుండానే గుండెజబ్బు కూడా వచ్చి కన్నుమూశాడు.

చంద్రశేఖరం తప్పనిసరియై అపరబ్రహ్మను పదవీచ్యుతుని చేసినా, సీతను అడవికి పంపిన శ్రీరాముడు- 'సీత స్వర్ణప్రతిమ'తో అశ్వమేధ యాగాన్ని నిర్వర్తించినట్లు అపరబ్రహ్మగారి కాంస్యవిగ్రహాన్ని ప్రక్కన, చిత్రపటాన్ని వెనుక పెట్టుకుని పరిపాలన సాగించసాగాడు.

ఆ విధంగా 'చంద్రగ్రహణం' కారణంగా కర్మశేషం పరిపూర్తి అయి అపరబ్రహ్మ అశువులు బాసి బ్రహ్మవాక్కు నిజమయ్యింది.

ఇంతకీ... చంద్రశేఖరం ఎవరో కాదు, అపరబ్రహ్మగారి అనుంగు అల్లుడు. ఈ 'దశమగ్రహ' గ్రహణంతో అపరబ్రహ్మగారి అవతారం పరిసమాప్తి చెందింది.

– సోమేశ్వర సాహితీ సమితి కథల పోటీ... '98